ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్

జగిత్యాల, జూన్ 14: ధరణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ కలెక్టర్లను ఆదేశించారు. ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం ఆయన ఆయా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ, లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన కంటే ముందు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 1.38 లక్షల పెండింగ్ ధరణి దరఖాస్తులను పరిష్కరించామన్నారు. తహసీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తులను రివ్యూ చేసుకోవాలని, పెద్ద సంఖ్యలో పెండింగ్ ఉన్న చోట అదనపు సిబ్బందిని కేటాయించాలని ఆదేశించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయిలో ప్రతి మంగళ, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణిలో వచ్చే భూసమస్యలను సైతం కలెక్టర్లకు బదిలీ చేస్తున్నామని, వీటిని సత్వరమే పరిష్కరించాలని పేర్కొన్నారు. భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంపు ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నదని, ఇందుకోసం జిల్లాలో భూముల మార్కెట్ విలువ, ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువ వివరాలతో కూడిన నివేదికను అందించాలని, మార్కెట్ విలువ నమోదులో ఎక్కడా స్థానికంగా ఎలాంటి వివాదాలు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుకు అనువైన భవనం లేదా స్థలం కేటాయించి ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్లకు సూచించారు. జగిత్యాల జిల్లాపై సమీక్షిస్తూ, జిల్లాలో వివిధ మాడ్యూల్స్‌లలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణికి సంబంధించిన 14 అప్లికేషన్స్ పెండింగ్‌లో ఉన్నాయని, సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ, జిల్లాలోని తహసీల్దార్లు, ఆర్డీవోల లాగిన్‌లో ఉన్న అర్జీలను పరిశీలించి వారం లోగా పరిశీలించాలన్నారు. రాష్ట్ర స్థాయి ప్రజావాణిలో 14 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిశీలించి, దరఖాస్తుదారులతో మాట్లాడి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. పూర్తి సమాచారంతో పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీవోలు మధుసూదన్, ఎన్ ఆనంద్‌కుమార్, శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలన అధికారి హన్మంతు రావు, తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా మండల సర్వసభ్య సమావేశం

- ఐసీడీఎస్‌లో అక్రమాలపై నిలదీసిన సహకార సంఘం అధ్యక్షుడు
- ప్రొటోకాల్ వందశాతం అమలు చేస్తాం: ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ సమక్షంలో ఐసీడీఎస్‌లో అక్రమాలపై అధికారులను నిలదీస్తున్న విశాల సహకార సంఘం అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

మెట్‌పల్లి రూరల్, జూన్ 14: మెట్‌పల్లి మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. శుక్రవారం ఎంపీపీ మారు సాయిరెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు లేవనెత్తిన సమస్యలతో సమావేశం రసవత్తరంగా సాగింది. మెట్‌పల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని విశాల సహకార సంఘం అధ్యక్షుడు కొమిరెడ్డి తిరుపతిరెడ్డి ఆరోపించారు. కోడిగుడ్ల బరువు 50 గ్రాములు ఉండాల్సి ఉండగా, కేవలం 30-35 గ్రాములు మాత్రమే ఉంటున్నాయని, అయినా సంబంధిత అధికారులు వాటిని తిప్పిపంపకుండా, ఎలా అనుమతిస్తున్నారని నిలదీశారు. గర్భిణులకు ఆరు లీటర్ల పాలు ఇవ్వాల్సి ఉండగా, రెండు ప్యాకెట్లు మాత్రమే ఇస్తున్నారని, రికార్డుల్లో పిల్లలు, గర్భిణుల సంఖ్యను అధికంగా నమోదు చేసి సరుకులను కాజేస్తున్నారని ఆరోపించారు. మెట్‌పల్లి సీడీపీవో తిరుమలాదేవి కరీంనగర్ నుంచి మెట్‌పల్లికి వచ్చిపోయేందుకు సమయం సరిపోతుందని, సూపర్‌వైజర్లు కేంద్రాలను సక్రమంగా తనిఖీ చేయడం లేదని తెలిపారు. మెట్‌పల్లి ఐసీడీఎస్‌లో జరుగుతున్న అక్రమాలపై తన వద్ద ఆధారాలున్నాయని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ, అంగన్‌వాడీలో అక్రమాలపై ఇంతవరకు ఎవరూ తన దృష్టికి తీసుకురాలేదని, సబ్ కమిటీ వేసి, తానే స్వయంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని చెప్పారు. ఎస్సారెస్పీ ఉపకాలువలు ఆనవాళ్లు కోల్పోతున్నాయని, వాటిని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సాయిరెడ్డి ఇరిగేషన్ అధికారులకు సూచించారు. అధికారిక కార్యక్రమాల్లో సైతం ప్రొటోకాల్ పాటించడం లేదని, తమకు కనీస సమాచారం ఇవ్వడం లేదని, ఈ విషయమై గత సమావేశాల్లో చర్చించినా అధికారుల్లో మార్పు రావడం లేదని మేడిపల్లి ఎంపీటీసీ గుండెల నగేశ్ తెలిపారు. ఇకపై వందశాతం ప్రొటోకాల్ పాటించేలా చూస్తానని, ఒకవేళ ఎక్కడైనా ప్రొటోకాల్ విస్మరిస్తే సంబంధిత అధికారులపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో జడ్పీ సభ్యురాలు కాటిపెల్లి రాధాశ్రీ, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- సారంగాపూర్ మండల సర్వసభ్య సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

ఎంపీపీ కోల జమునను సన్మానిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, సభ్యులు, అధికారులు

సారంగాపూర్, జూన్ 14: ప్రజాప్రతినిధులు పదవీ కాలం పూర్తయిన తర్వాత ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఎంపీపీ కోల జమున అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, ప్రజా సేవ చేసే వారిని ప్రజలు ఆశీర్వదిస్తారని పేర్కొన్నారు. మండల అభివృద్ధికి సభ్యులు ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ఎంపీపీ కోల జమున మాట్లాడుతూ, తమ పదవీ కాలంలో ప్రజలకు తమవంతు సేవలందించినట్లు తెలిపారు. పదవీ కాలం పూర్తయిన తర్వాత కూడా ప్రజల కోసం సేవ చేస్తామని చెప్పారు. జడ్పీటీసీ మేడిపెల్లి మనోహర్ మాట్లాడుతూ, ఐదేళ్ల పాటు సభ్యులంతా కలిసికట్టుగా పని చేశామని, అధికారులు కూడా తమవంతు సహకారం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులు, తదితర అంశాలపై సభ్యులు చర్చించారు. అనంతరం ఎంపీపీ, జడ్పీటీసీతో పాటు ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులను శాలువాలతో సత్కరించి, మెమోంటోలు అందజేశారు. అలాగే, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతను అధికారులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. సమావేశంలో వైస్ఎంపీపీ సొల్లు సురేందర్, సింగిల్ విండో చైర్మన్ ఏలేటి నర్సింహారెడ్డి, సభ్యులు జోగినిపెల్లి సుధాకర్ రావు, మానాల ప్రసన్నమాల, ఏలేటి మమత, భుక్యా లావణ్య రాథోడ్, మాలెపు విమల, మండల కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అమీర్, ఎంపీడీవో లచ్చాలు, ఎంపీవో శశి కుమార్, ఏఈ తిరుపతి నాయక్, ఎంఈవో భీమయ్య, ట్రాన్స్‌కో ఏఈ సతీశ్, పీఆర్ ఏఈ భూపతి, వైద్యాధికారి శివకుమారి, ఏపీఎం రాజయ్య, ఆర్ఐ కృష్ణ, సూపర్‌వైజర్లు లత, శైలజ, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

జగిత్యాల, జూన్ 14: ప్రకృతి వైపరీత్యాలు సంభవించక ముందే ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని అదనపు కలెక్టర్ రాంబాబు అధికారులను ఆదేశించారు. పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై శుక్రవారం ఆయన జిల్లా, మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాంబాబు మాట్లాడుతూ, వరదలు, భారీ వర్షాలతో ప్రమాదాలు, ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. భారీ వర్షాలకు చెరువులు, కుంటలు పొంగి పొర్లే అవకాశం ఉన్నందున ప్రజల రాకపోకలకు అంతరాయం కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవోలు మధుసూదన్, ఆనంద్‌కుమార్, శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

వెల్గటూర్, జూన్ 14: ఎండపల్లి మండలం పాతగూడూర్ జడ్పీ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థులు సహర్షిత, వైష్ణవి, హస్విత ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు రాధారాణి తెలిపారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఏపీఎస్ చైర్‌పర్సన్ అంజలి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సంజయ్ పరామర్శ

జగిత్యాల, జూన్ 14: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, జగిత్యాల మండల రజక సంఘం అధ్యక్షుడు మర్రిపెల్లి పోచాలు పక్షవాతంతో బాధపడుతూ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ శుక్రవారం వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని దవాఖానకు తీసుకెళ్లాలని కుటుంబసభ్యులకు సూచించారు. అలాగే, పట్టణంలోని 15వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు కువైట్ మల్లేశం (ముద్దం రాజమల్లు) అనారోగ్యంతో జగిత్యాలలోని దవాఖానలో చికిత్స పొందుతుండగా వెళ్లి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట కౌన్సిలర్ తోట మల్లికార్జున్, రజక సంఘం నాయకులు ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

మెట్‌పల్లి, జూన్ 14: కలెక్టర్ యాస్మిన్ బాషాను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులకు సంబంధించి కలెక్టర్‌తో చర్చించారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

పట్టణంలోని ఆబ్కారీ కార్యాలయం

ఆబ్కారీ సార్ల ఇష్టారాజ్యం

మెట్‌పల్లి, జూన్ 14: పట్టణంలోని మెట్‌పల్లి సర్కిల్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ (ఆబ్కారీ) కార్యాలయం అధ్వానంగా మారింది. అధికారులు, సిబ్బంది ఎప్పుడు వస్తారో.. ఎప్పటి వరకుంటారో తెలియని పరిస్థితి. శుక్రవారం మధ్యాహ్నం 12.20 గంటల ప్రాంతంలో కూడా అధికారులు, సిబ్బంది రాకపోవడంతో మెయిన్‌గేట్‌తో పాటు కార్యాలయ గదులకు తాళాలు వేసి ఉన్నాయి. స్టేషన్ ఆవరణ చెత్తాచెదారంతో నిండి కంపుకొడుతున్నది. ఈ విషయమై ప్రొహిబిషన్,ఎక్సైజ్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ సత్యనారాయణను ఫోన్‌లో సంప్రదించగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కార్యాలయంలో సిబ్బంది లేకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

రక్తదాన శిబిరం

జగిత్యాల, జూన్ 14: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మేయో దవాఖానలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కెమిస్ట్, డ్రగ్గిస్ట్ జిల్లా అధికారి ఉపేందర్, సాక్ష్యం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ తాటిపాముల సురేశ్ కుమార్, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య, కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గాలిపల్లి నర్సయ్య, సాక్ష్యం జిల్లా కార్యదర్శి కూర్మాచలం రఘునందన్, బోయినపల్లి ప్రసాదరావు, వడ్లకొండ రవీందర్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, నాయకులు

జగిత్యాల, జూన్ 14: జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి నచ్చితే సక్రమం, నచ్చకుంటే అక్రమమని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాకు శుక్రవారం ఆయన వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, లైబ్రరీ మాజీ డైరెక్టర్, పద్మశాలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ పట్టణంలో ఇల్లు నిర్మించుకుంటే జీవన్ రెడ్డి ఓర్వలేక కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, మున్సిపల్ నుంచి నోటీసు రావడం బాధాకరమని అన్నారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి హయాంలో బట్టివాడలోని స్కూల్‌జోన్‌లో ఇండ్ల నిర్మాణానికి అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు.? కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు ఆనందరావు, వొల్లెం మల్లేశం, సమిండ్ల శ్రీనివాస్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

బండరాళ్లపై పడి వృద్ధుడి మృతి

మల్యాల(కొడిమ్యాల), జూన్ 14: మల్యాల మండలం బల్వంతాపూర్ శివారులోని ఓ క్వారీలో బండరాళ్లపై పడి వృద్ధుడు మృతి చెందాడు. మల్యాల ఎస్ఐ అబ్దుల్ రహీం తెలిపిన వివరాల ప్రకారం.. బల్వంతాపూర్ గ్రామానికి చెందిన నెలబోయిన పర్శయ్య (60) కొంత కాలంగా ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో రాత్రి సమయంలో తిరుగుతున్నాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి కుటుంబసభ్యులు నిద్రించిన తర్వాత ఇంటి నుంచి బయటకు వెళ్లారు. శుక్రవారం ఉదయం నిద్ర లేచి చూసేసరికి ఇంట్లో లేకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో వెతికారు. గ్రామ శివారులోని క్వారీలో బండరాళ్లపై పడి మృతి చెంది ఉన్నాడు. పర్శయ్య కొడుకు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ అబ్దుల్ రహీం తెలిపారు. కాగా, ఘటనా స్థలాన్ని సీఐ నీలం రవి పరిశీలించారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం, జూన్ 14: ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి చెందిన సున్నం రవి (42) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. సున్నం రవికి గ్రామానికి చెందిన రెబ్బటి రాజేందర్ రూ. 2 లక్షలు అప్పుగా ఇవ్వకుండానే ఇచ్చినట్లు బెదిరించి పేపర్‌పై సంతకం తీసుకొని, అట్టి డబ్బులు చెల్లించాలని బెదిరిస్తున్నాడని తెలిపారు. అలాగే, గ్రామానికి చెందిన కనక జగన్, చెప్పుల శ్రీనివాస్, గంట గణేశ్ తన వద్ద అప్పు తీసుకొని, తిరిగి ఇవ్వమంటే చంపుతామని బెదిరిస్తున్నారని సూసైడ్ నోట్‌లో రాశాడు. కాగా, నలుగురికి భయపడి ఆత్మహత్య చేసుకున్నాడని రవి భార్య లక్ష్మి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. నలుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

జగిత్యాల రూరల్, జూన్ 14: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. పొరండ్ల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అక్షరాభ్యాసం చేయించారు. ఐసీడీఎస్ సీడీపీవో ఎం వీరలక్ష్మి, సూపర్‌వైజర్ లావణ్య, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ నరేశ్ రెడ్డి, కార్యదర్శి జయశ్రీ, హెచ్ఎంలు సునీత, శ్రీవాణి, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం, జూన్ 14: డబ్బా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సరస్వతీ విగ్రహానికి పూజలు నిర్వహించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రతిభ, అంగన్‌వాడీ టీచర్లు గంగామణి, సంజీవరాణి, ప్రధానోపాధ్యాయులు మనోజ్, ప్రసాద్, అశోక్, రాజ్‌కుమార్, స్వామి, లింగస్వామి, భవాని, మమత, శివ, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలకు ఆత్మీయ సత్కారం

మారుతీనగర్, జూన్ 14: పట్టణానికి చెందిన ఎనుగందుల ఉదయ్ కుమార్ 500 మంది మిత్రబృందంతో రక్తదాన కార్యక్రమాల ద్వారా 3000 మందికిపైగా రక్తాన్ని అందించారు. అలాగే, మెట్‌పల్లి స్నేహాలయ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరాలు నిర్వహించిన కిరణ్ సేవలను గుర్తించి ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు శాలువాలతో సత్కరించి, ప్రశంసాపత్రాలు అందజేశారు.

కోరుట్ల, జూన్ 14: పట్టణానికి చెందిన చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, రక్తదాన సంధానకర్త కటుకం గణేశ్ ఇండియన్ రెడ్ క్రాస్ ప్రతినిధులు అవార్డుతో సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు రాజ్‌కుమార్, శ్రీనివాస్, కృష్ణ, వేణుగోపాల్, వెంకటేశ్వర రావు, వైద్యులు శ్రీనివాస్, సమీరొద్దీన్, టీవీ సూర్యం, చారి, ప్రవీణ్, రామకృష్ణ, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న వాహనాల పట్టివేత

మెట్‌పల్లి/మల్లాపూర్, జూన్ 14: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను గురువారం రాత్రి మెట్‌పల్లి పోలీసులు పట్టుకున్నారు. కోరుట్ల వైపు నుంచి నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని, యజమాని నవీన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. మల్లాపూర్ మండలం సాతారం, వాల్గొండ గ్రామాల శివారులో గోదావరి, వాగుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

మహా కాలభైరవస్వామికి ప్రత్యేకపూజలు

కోరుట్ల రూరల్, జూన్ 14: చిన్నమెట్‌పల్లి గ్రామ శివారులోని గుట్టపై గల మహా కాలభైరవస్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిని కలిసిన బీజేపీ నేతలు

కథలాపూర్/కొడిమ్యాల/మేడిపల్లి, జూన్ 14: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను ఢిల్లీలో జిల్లాకు చెందిన పలువురు బీజేపీ నాయకులు శుక్రవారం కలిశారు. పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్మల వినోద్‌రెడ్డి, నాయకులు డబ్బు గౌతంరెడ్డి, భీమారం మండలాధ్యక్షుడు ముంజ శ్రీనివాస్‌గౌడ్, అన్నాడి జలపతిరెడ్డి, మాజీ సర్పంచులు మామిడి సత్తవ్వ, కొప్పెర లింగారెడ్డి, మాజీ ఎంపీటీసీ సురకంటి విజయ, ఎస్ఎ న్‌రెడ్డి, మెన్నేని తిరుమల్‌రావు, తదితరులున్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

కొడిమ్యాల, జూన్ 14: నల్లగొండ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చీకట్ల సింధు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ ప్రత్యేకాధికారి పల్లె ప్రసాద్, మాజీ వార్డు సభ్యుడు కడకుంట్ల శోభన్, అంగన్‌వాడీ టీచర్లు నాగేంద్ర, సద్గుణశీల పాల్గొన్నారు.

రోడ్డు నాణ్యతను పరిశీలించిన అధికారులు

పెగడపల్లి, జూన్ 14: మండల కేంద్రంలో ఇటీవల నిర్మించిన ఆర్అండ్‌బీ రోడ్డు నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఈఈ సామ్యూల్, డీఈలు సత్యనారాయణ, శ్రీనివాస్, ఏఈలు ఆదిత్య, రవి పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

పెగడపల్లి, జూన్ 14: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శుక్రవారం డ్రై డే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, వైద్యాధికారి నరేశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న సీజీఎం తిరుమల్‌రావు

మెట్‌పల్లి, జూన్ 14: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా ఎన్పీడీసీఎల్ వరంగల్ సీజీఎం తిరుమల్‌రావు అధికారులను ఆదేశించారు. పట్టణంలో శుక్రవారం ఆయన జిల్లా స్థాయి విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీజీఎం మాట్లాడుతూ, పాత విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్లను గుర్తించి వాటి ఆధునీకరణకు అంచనాలు రూపొందించి పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి సెక్షన్‌లో కనీసం ఐదు ట్రాన్స్‌ఫార్మర్లను ఎంపిక చేసి వాటి నిర్వహణ బాధ్యతలను తీసుకోవాలని సూచించారు. ప్రతి రెండు నెలలకోసారి ప్రభుత్వ దవాఖానలను తనిఖీ చేసి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్తంభాలు విరిగి విద్యుత్ అంతరాయం ఏర్పడితే వెంటనే ఇతర ప్రాంతాల నుంచి ప్రత్యామ్నాయ లైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అంతకు ముందు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మల్లాపూర్ మండలం వాల్గొండలో జరుగుతున్న ఆధునీకరణ పనులను పరిశీలించారు. సమావేశంలో ఎస్ఈ సత్యనారాయణ, డీఈలు తిరుపతి, గంగారాం, రవీందర్, ఏడీఈలు మనోహర్, ఆంజనేయరావు, రాజబ్రహ్మాచారి, రాజు, నాగచారి, ఏఈలు అమరేందర్, రవి, నవీన్, మమత పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ రాష్ట్ర కార్యదర్శికి సత్కారం

జగిత్యాల టౌన్, జూన్ 14: హైదరాబాద్‌లోని టీఎన్జీవోస్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అధ్యక్షతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జగిత్యాల జిల్లా అధ్యక్షుడు బోగ శశిధర్, జిల్లా కార్యదర్శి మిర్యాల నాగేందర్‌రెడ్డి హాజరయ్యారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎం ముజీబ్ హుస్సేన్‌ను ఎన్నుకున్నారు. ఎస్ఎం ముజీబ్ హుస్సేన్‌ను జగిత్యాల జిల్లా ఉద్యోగుల పక్షాన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, ట్రెస్సా జిల్లా అధ్యక్షుడు ఎండీ వకీల్ సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ నాయకులు రవీందర్, మధుకర్, సురేందర్, శ్యాంకుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

జగిత్యాలలో భారీ వర్షం

జగిత్యాల టౌన్, జూన్ 14: జిల్లా కేంద్రంలో శుక్రవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. చెట్ల కొమ్మలు విరిగిపడడంతో విద్యుత్ వైర్లు తెగి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలైన టవర్‌సర్కిల్, మార్కండేయనగర్, సరుగమ్మ వీధులు కాలువలను తలపించాయి. టవర్ సర్కిల్ ఏరియాలో వరద నీటితో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాధ్యతల స్వీకరణ

జగిత్యాల రూరల్, జూన్ 14: ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా రాజ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాజ్‌కుమార్‌కు సిబ్బంది అభినందనలు తెలిపారు.

మహాలక్ష్మి బోనాల జాతర

మేడిపల్లి, జూన్ 14: భీమారం మండలం దేశాయిపేటలో శుక్రవారం మహాలక్ష్మీ బోనాల జాతర నిర్వహించారు. అమ్మవారిని జడ్పీ ఉపాధ్యక్షుడు హరిచరణ్‌రావు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

మట్టి, మొరం తరలిస్తున్న వారిపై కేసు

మల్యాల(కొడిమ్యాల), జూన్ 14: మల్యాల మండలం కొండగట్టు శివారులో టిప్పర్‌లో అక్రమంగా మొరం తరలిస్తుండగా పట్టుకొని డ్రైవర్ కొను మహేశ్, ఓనర్ మురళిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అబ్దుల్ రహీం తెలిపారు. అలాగే, బల్వంతాపూర్ గ్రామంలో అక్రమంగా నల్లమట్టి టిప్పర్‌ను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. డ్రైవర్, యజమాని శివరాత్రి లక్ష్మణ్, రవీందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మారుతీనగర్/మల్యాల(కొడిమ్యాల), జూన్ 14: మెట్‌పల్లి పట్టణంలోని పాతబస్టాండ్, వెల్లుల్ల రోడ్, బస్ డిపో, శాంతినగర్, రెడ్డి కాలనీ, బీడీ కాలనీ, రేగుంట రోడ్, పోస్టాఫీస్, సింగపూర్, ఇంద్రానగర్, వేంపేట రోడ్, అంబేద్కర్‌నగర్, మఠంవాడ, లైబ్రరీ, మార్కెట్, చైతన్యనగర్, ఏకలవ్యనగర్, సాయిరాంకాలనీ, మున్సిపల్ ఏరియాకు శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ జక్కుల అమరేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, మల్యాల మండలం రాంపూర్, ఒడ్డెరకాలనీ, ఓబులాపూర్, పోతారం, రాజారాం, తాటిపల్లి, లంబాడీపల్లి గ్రామాలకు శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మెట్‌పల్లి, జూన్ 14: పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని శుక్రవారం మెట్‌పల్లి పోలీసులు పట్టుకున్నారు. మెట్‌పల్లి నుంచి నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌కు పీడీఎస్ బియ్యం లోడ్‌తో వెళ్తున్న వాహనాన్ని వెల్లుల్ల శివారులో పట్టుకొని, అందులో చూడగా 9 క్వింటాళ్ల బియ్యం లభ్యమయ్యాయి. బియ్యం విలువ రూ. 18 వేలు ఉంటుందని, వాహన డ్రైవర్ జమాల్, యజమాని అప్సర్‌అలీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

మేదరి సంఘం కార్యవర్గం

సారంగాపూర్, జూన్ 14: బీర్‌పూర్ మండల కేంద్రంలో శుక్రవారం మేదరి సంఘం సమావేశం నిర్వహించారు. సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శనిగరపు సుదర్శన్, ఉపాధ్యక్షుడిగా శనిగరపు రమేశ్‌తో పాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు మామిడిపెల్లి శ్రీనివాస్, కంకాలమ్మ ఆలయ చైర్మన్ శనిగరపు రవీందర్, నాయకులు మామిడిపెల్లి ధనుంజయ్, చింత కృష్ణ, రాజయ్య, మహేందర్, రాజేశ్, గంగయ్య, దుబ్బయ్య, లచ్చన్న, నర్సింగం, రమేశ్, రాజు, ఈశ్వరయ్య, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్డెక్కితే చర్యలు

జగిత్యాల/జగిత్యాల అర్బన్, జూన్ 14: ఫిట్‌నెస్ లేని స్కూల్, కాలేజీ బస్సులు రోడ్డెక్కితే చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణా శాఖాధికారి వంశీధర్ హెచ్చరించారు. ప్రైవేట్ స్కూల్, కాలేజీ బస్సులను శుక్రవారం రవాణా శాఖ అధికారులు తనిఖీ చేశారు. బస్సు ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్, ఫైర్‌సేఫ్టీ, ఫస్ట్ ఎయిడ్ కిట్లను పరిశీలించారు. ఫిట్‌నెస్ లేని మూడు స్కూల్ బస్సులను సీజ్ చేశారు. కార్యక్రమంలో ఆర్టీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు

జగిత్యాల, జూన్ 14: జగిత్యాల సర్కిల్ పరిధిలో విద్యుత్ ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టామని ఎస్ఈ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండ్లల్లో నాణ్యమైన వైరింగ్ లేకపోవడం, నాసిరకం విద్యుత్ పరికరాలు వాడడం, రైతులు స్విచ్ బోర్డు/మోటార్ స్టార్టర్ల దగ్గర భద్రత ప్రమాణాలు (ఎర్తింగ్) పాటించకపోవడంతో విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణే ధ్యేయంగా ఉద్యోగులు, సిబ్బంది పని చేయాలని సూచించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సారంగాపూర్, జూన్ 14: బీర్‌పూర్ శివారులోని రోళ్లవాగు ప్రాజెక్ట్ కట్ట కింద శుక్రవారం సాయంత్రం సగం వరకు కాలిన మృతదేహాన్ని రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. జగిత్యాల రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్, సిబ్బంది రాత్రి ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. వ్యక్తి మృతదేహం సగం వరకు కాలి పోయి ఉందని, ఆత్మహత్యానా, హత్య కోణంలో విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

బేటీ బచావో-బేటీ పడావోపై అవగాహన

జగిత్యాల రూరల్, జూన్ 14: ధరూర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా సాధికారత కేంద్ర బృందం బేటీ బచావో-బేటీ పడావోపై మహిళలకు అవగాహన కల్పించారు. చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు.